క్లుప్తంగా

అమ్మవార్లకు జలాభిషేకం



జలాభిషేకం చేయడానికి వెళ్తున్న మహిళలు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామంలోని ముత్యాల పోచమ్మ, మదన పోచమ్మ అమ్మవార్లకు ఆదివారం జలాభిషేకం చేశారు. ఈ నెల 30 నుంచి 4వ తేదీ వరకు గ్రామంలో నిర్వహించే భూలక్ష్మి, శ్రీలక్ష్మి సహిత గ్రామ శిల (బొడ్రాయి) ప్రతిష్ఠ, పోచమ్మ కొలుపు ఉత్సవాలను పురస్కరించుకొని పోచమ్మ ఆలయాల్లో నూతన విగ్రహాలను ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

వెన్నంపల్లిలో ఆకట్టుకున్న కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వెన్నంపల్లి గ్రామంలో జానపద కళాకారులు ఆదివారం కళాజాత నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం వంటిదని, నోటుకు, బీరుకు, బిర్యానికి అమ్ముడు పోతే భవిష్యత్ తాకట్టు పెట్టినట్లేనని, ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బేటి బచావో-బేటి పడావో, ఆడపిల్లలను బతుకనిద్దాం బతుకు ఇద్దాం, ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు వంటి నినాదాలతో ప్రజలను కళాజాత ద్వారా చైతన్యపరిచారు. కళాకారులు జనగామ రాజనర్సు, కన్నూరి రేణుక, జిన్న రమాదేవి, శ్రీవల్లి, మల్లేశంగౌడ్, ఈదునూరి పద్మ, సలేంద్ర రాజన్న, బుర్ర శంకర్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



ఎన్నిక పత్రం అందజేస్తున్న నాయకులు

ఓదెల: బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా మండలంలోని గుంపుల గ్రామానికి చెందిన తాళ్లపల్లి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా పెరవేని సతీశ్ ఎన్నికైనట్లు రాష్ట్ర ఓబీసీ మోర్చా కోశాధికారి తాత రవియాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు కారెంగుల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మండలంలోని కొలనూర్‌లో బీజేపీ మండలస్థాయి కమిటీ సమావేశం జరిగింది. బీజేపీ బలోపేతానికి, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కృషిచేస్తామని ఎన్నికైన వారు పేర్కొన్నారు.

దేవునిపల్లిలో నేడు ప్రత్యేక పూజలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం దేవునిపల్లిలోని శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకులు శ్రీకాంతాచార్యులు తెలిపారు. అలాగే హోలీ ఉత్సవాన్ని జరిపి భక్తులకు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు వచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఆశ్రమ చిన్నారులకు పండ్లు పంపిణీ

రామగుండం: అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ తన సోదరుడు స్వర్గీయ పరశురాం వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం పట్టణ పరిధిలో ఉన్న తబితా ఆశ్రమంలోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సతీమణి విజయనిర్మల, కుమారుడు పరశురాం ఉన్నారు.

స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

పెద్దపల్లిరూరల్: మైనారిటీ స్టడీ సర్కిల్ ద్వారా యూపీఎస్సీ -సీశాట్ -2025 పరీక్ష కోసం ఉచిత శిక్షణ పొందాలనుకునేవారు ఏప్రిల్ 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మెహరాజ్ మహమ్మద్ తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 040-23236112 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆర్థికసాయం అందజేత

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన నిరుపేద కల్లెపెల్లి అశోక్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు అందజేశారు.

సాగు లెక్క.. ఇక పక్కా

- అందుబాటులోకి 'ఏఈవో యాప్'
- రైతుల పంట వివరాలన్నీ నమోదు



పంట వివరాలు నమోదు చేస్తున్న ఏఈవోలతో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి

సుల్తానాబాద్: రైతులు ఎలాంటి పంటలు సాగు చేస్తున్నారనే విషయమై వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండానే వివరాలు నమోదు చేసేవారు. దీనికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కొత్తగా 'ఏఈవో యాప్'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. యాసంగి కాలంలో పంట సమగ్ర సర్వే కచ్చితంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు.

వరిసాగుకే మొగ్గు..

వ్యవసాయ విస్తరణాధికారులు క్షేత్రస్థాయిలో రైతుల వద్దకు వెళ్లి చేపట్టిన పంటల నమోదు ప్రక్రియ పూర్తయింది. ఈ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పంట సాగుచేసే ప్రతి రైతు వివరాల నమోదు ఆధారంగా ప్రభుత్వ కేంద్రాల్లో పంట విక్రయించుకునే అవకాశం ఉంది. పంటల దిగుబడి అంచనా వివరాలు నమోదు చేస్తేనే కేంద్రాల్లో పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడంతో ఈ వివరాలకు ప్రాముఖ్యత ఏర్పడింది. వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకుంటే కేంద్రాలకు వచ్చిన పంటలను తిరస్కరించనున్నారు.

సర్వే ఆధారంగానే..

ఈ సర్వేలో ముఖ్యంగా రైతు పేరు, సర్వే నెంబరు, పంట వివరాలు, సాగు ఎకరాలు, వంటి వివరాలు నమోదు చేస్తున్నారు. వ్యవసాయ విస్తరణాధికారులు తమ క్లస్టర్ పరిధిలోని గ్రామాలకు వెళ్లి రైతుబంధు సభ్యులతో కలిసి సర్వే పూర్తిచేశారు. జిల్లాలోని క్లస్టర్లు, మండలాల వారీగా ఎంత విస్తీర్ణంలో ఏయే పంటలు సాగు అవుతుందో లెక్క తేలింది.

జిల్లాలో ప్రధాన పంటల వివరాలు

పత్తి 780 ఎకరాలు, వరి 2,05,321 ఎకరాలు, మొక్కజొన్న 10,670 ఎకరాలు, ఇతర పంటలు 565 ఎకరాలు, మొత్తం 2,17,336 ఎకరాలు.

పకడ్బందీగా నమోదు



జిల్లాలో సాగవుతున్న పంట నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాం. రైతులు సాగుచేస్తున్న పంటలకు సంబంధించి వివరాలు ఏఈవోలు నమోదు చేశారు. రైతులు వారి వివరాలు సరి చేసుకునేందుకు అవకాశం కల్పించాం. రైతు సాగుచేస్తున్న పంట వివరాలు వారి ఫోను నంబర్లకు సందేశం పంపించాం. సాగుచేసే ప్రతి పంటను నమోదు చేశాం. – ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, పెద్దపల్లి

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం



హంస వాహనంపై విగ్రహాల శోభాయాత్ర

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో రూ.కోటి విరాళాలతో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీసీతారామచంద్రస్వామి సమేత లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలను హంసవాహనంపై గ్రామంలో శోభాయత్ర నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ సంతోష్‌రావు, ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్, కామరాజు, కాంతయ్య, రాజన్న, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బీజేపీ శ్రేణులు

రామగుండం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆదివారం 20వ డివిజన్ పరిధిలోని స్థానిక రైల్వేస్టేషన్ ఏరియా భరత్‌నగర్ తదితర కాలనీల్లో బీజేపీ శ్రేణులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఆయుష్మాన్ భారత్ కింద రూ.55కోట్ల లబ్ధిదారులకు రూ.5లక్షల ఆరోగ్యరక్షణ ప్రవేశ పెట్టిందని, ప్రధానమంత్రి స్వనిధి యోజన కింద రూ.53లక్షల మంది వీధి వ్యాపారులకు స్థాయిని బట్టి రుణాలు మంజూరు చేశారని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నాలుగు కోట్లకు పైగా పేద ప్రజలకు పక్కా గృహాలను నిర్మించారని తదితర పథకాలపై అవగాహన కల్పించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను అధిక మెజార్టీతో గెలిపించి కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వాన్ని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ప్రతినిధులు మందల శ్రీనివాస్ ముదిరాజ్, మామిడి రాజేశ్, మాతంగి రేణుక, గుర్రాల కుమారస్వామి ఉన్నారు.

మహిళలు స్వయంకృషితో అభివృద్ధి చెందాలి



కేక్ కట్ చేస్తున్న మాజీ సర్పంచ్ పద్మ

రామగిరి: మహిళలు స్వయం కృషితో అభివృద్ధి చెందాలని కల్వచర్ల మాజీ సర్పంచ్ గంట పద్మ అన్నారు. ఆదివారం మండలంలోని కల్వచర్ల గ్రామంలో సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యూటీషియన్ శిక్షణ ముగింపు తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వృత్తి విద్యా నైపుణ్య శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ స్వయం శక్తితో అంచెలంచెలుగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. మాజీ ఉపసర్పంచ్ వేము కనకయ్య, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, సేవాసమితి కార్యదర్శి ఉమాదేవి, బ్యూటీషియన్ శిక్షకురాలు శిరీష పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు చేస్తున్న కేకే నగర్‌వాసులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి కేకేనగర్ గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి వానరం మృతి చెందింది. గ్రామస్తులంతా కలిసి మృతి చెందిన వానరానికి దహన సంస్కారాలు నిర్వహించారు. వెంకట్రావుపల్లి మాజీ ఎంపీటీసీ తిరుపతి, మాజీ సర్పంచ్ సదానందం, బీఆర్ఎస్ నాయకులు బూడిద సమ్మయ్య, సత్యనారాయణ, శ్రీరాములు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎల్‌వోసీ అందజేత..

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన పి.పోచమ్మకు వైద్యఖర్చుల నిమిత్తం హైదరబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి సీఎంఆర్ఎఫ్ కింద రూ.15,000 విలువైన ఎల్‌వోసీని ఎమ్మెల్యే విజయరమణారావు అందజేశారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నాగెపల్లికి చెందిన వ్యక్తికి..

రామగిరి: మండలంలోని నాగెపల్లి గ్రామానికి చెందిన మొల్లు శ్రేయాస్‌కు రూ.2,50,000 విలువైన ఎల్‌వోసీ మంజూరైంది. శ్రేయాస్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హాస్పిటల్ ఖర్చుల కోసం మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా ఎల్‌వోసీ మంజూరు చేశారు.

ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీ అభివృద్ధి కమిటీ నియామకం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు అన్నపూర్ణకాలనీ అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం అన్నపూర్ణకాలనీలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా మల్లేపల్లి నగేష్, ప్రధాన కార్యదర్శిగా ఊడెం మల్లేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం అన్నపూర్ణకాలనీలో సమావేశంలో ఏర్పాటు చేశారు. అభివృద్ధి కమిటీ ముఖ్య సలహాదారుడిగా కాంతాల భాస్కర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా కాంతాల మోహన్‌రెడ్డితో పాటు సభ్యులుగా దొండపాటి మల్లారెడ్డి, చంద్రయ్య, మహిపాల్‌రెడ్డి, శాంతమ్మ, గోసిక శ్రీనివాస్, తోట కుమారస్వామి, మేడి తిరుపతిని ఎన్నుకున్నారు.

దాడికి గురైన ఎస్సీ, ఎస్టీలకు పరిహారం చెల్లించాలి

గోదావరిఖనిటౌన్: పెద్దపల్లి జిల్లాలోని అన్ని మండలాల్లో అగ్రకులాల కుల వివక్షతో దాడులకు గురైన ఎస్సీ, ఎస్టీలకు తక్షణమే ప్రభుత్వం పరిహారం చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు జిల్లా అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి, జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ నాగులేశ్వర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. నాయకులు మామిడిపల్లి బాపయ్య, లంక సదయ్య, పాల రాజేశం, ఆరెల్లి మల్లేశ్, రామలక్ష్మి, పాపయ్య, నవీన్‌బాబు, సందీప్, రవీందర్, సురేశ్, నారాయణ పాల్గొన్నారు.

జిల్లా మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడికి సత్కారం

పెద్దపల్లిరూరల్: జిల్లా మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కొలిపాక నర్సయ్యను ఆదివారం పలువురు సత్కరించారు. కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ మిత్రుడు తిర్రి సుధాకర్‌తో పాటు మిత్రబృందం, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన పలువురు సన్మానించారు.

రాజన్నను దర్శించుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను ఆశీర్వదిస్తున్న అర్చకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు కుటుంబంతో ఆదివారం వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం లడ్డు, ప్రసాదం అందించి ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదించారు.

వంశీని భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం



సన్మానిస్తున్న మాల మహానాడు నాయకులు

జూలపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని ఆదివారం పెద్దపల్లికి ప్రచారం చేయడానికి వచ్చిన సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పాటకుల మహేశ్ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం మహేశ్ మాట్లాడుతూ పార్లమెంటు అభ్యర్థిగా పోటీలో ఉన్న వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. చింతమల్ల నాగరాజు, ప్రణయ్, అమర్‌చంద్ ఉన్నారు.

నేడు ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం



శ్రీసీతారామ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం

జ్యోతినగర్: శ్రీసీతారామచంద్ర స్వామి నూతన ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం జరగనుంది. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని శ్రీరామచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. 27వ తేదీ వరకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మూడు రోజుల పాటు జరగనున్న కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఏకగ్రీవ ఎన్నిక

సుల్తానాబాద్: సహకార గృహ నిర్మాణ సంఘం మండల అధ్యక్షుడిగా కాసర్ల సుఖేందర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సహకార గృహ నిర్మాణ ఎన్నికల అధికారి కె.అనూష ప్రకటించారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా దొడ్ల సత్యనారాయణ ప్రసాద్, కార్యదర్శిగా కూకట్ల ఓదెలు, కోశాధికారిగా పల్లా సుధాకర్, పాలకవర్గ సభ్యులుగా కురుమ శంకరయ్య, కోట వెంకటేశ్‌ను ఎన్నుకొన్నారు. మరో 3 కార్యవర్గ సభ్యులు ఖాళీగా ఉన్నందున 6నెలల్లోపు ఎన్నికలు జరిపించాలని, రాష్ట్ర సహకార ఎన్నికల అధికారికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు ఆమె తెలిపారు.

ఘనంగా కామదహన వేడుకలు



కాల్వశ్రీరాంపూర్‌లో కామదహనం



సుల్తానాబాద్‌లో కాలనీవాసులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం కాముడి పౌర్ణమి సందర్భంగా కామదహన వేడుకలు నిర్వహించారు. 10రోజులుగా చిన్నా, పెద్దా జాజిరి ఆడుతూ ఇంటింటికీ వెళ్లి పాటలు పాడుతూ ధాన్యం, డబ్బులు తీసుకుని కామదహనం నిర్వహించారు. పదిరోజులు ఆడిన కోలలు మంటల్లో వేసి దహనం చేశారు.

వరద పాశం..

కాముడి పౌర్ణమి తెల్లవారుజామున పదిరోజుల ఆడి పోగు చేసిన ధాన్యాన్ని బెల్లం తెచ్చి చెరువు కట్టపై వరద పాయసం వండి వరుణ దేవుడికి వరద పాశం పేరున నైవేద్యంగా సమరిస్తారు. ఇలా చేస్తే వరుణ దేవుడు సంతృప్తి చెంది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ప్రజల విశ్వాసం.

సుల్తానాబాద్: పట్టణంలోని పలు కాలనీల్లో ఆదివారం కాముని దహనం నిర్వహించారు. పలు వీధుల్లో పలువురు వృద్ధులు, చిన్నారులు ఆడిన కోలలు, పిడకలు వస్తువులను తీసుకొచ్చి మంటల్లో వేసి దహనం చేశారు. సోమవారం హోలీ వేడుకలు నిర్వహించనున్నారు. చైర్‌పర్సన్ బిరుదు సమత, నాయకులు బిరుదు కృష్ణ, ఏకశిలా శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది రాజ్‌కుమార్ ఉన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం



సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

జ్యోతినగర్: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచెందర్‌ను ఆదివారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. అనంతరం ఆయనకు వినతిపత్రం అందజేశారు. విశ్రాంత ఉద్యోగులకు కార్యాలయ వసతి కల్పించాలని, పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీం-2017 రివైజ్డ్ పేస్కేల్ ప్రకారం ఇవ్వాలని, ఎన్టీపీసీ కార్పొరేట్ యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని, ఈపీఎస్-95 ప్రకారం ప్రస్తుతమున్న మినిమం పెన్షన్‌ను రూ.1000 నుంచి రూ.7500 పెంచాలని వినతిపత్రంలో కోరారు. ఎన్టీపీసీ రామగుండం సంస్థ మాజీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అపోహలు వీడండి.. నేత్రదానం చేయండి



అభినందన పత్రం అందజేస్తున్న సభ్యులు

రామగిరి: అపోహలు వీడి ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ ముఖ్య సలహాదారులు నూక రమేశ్, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన కురుమల్ల భూమయ్య 14న అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులు నేత్రాదానానికి ముందుకు వచ్చారు. ఆదివారం నేత్రదాత సంస్మరణ సభ నిర్వహించి కుటుంబ సభ్యులకు అభినందన పత్రం అందజేశారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ భగీరథ పైప్‌లైన్ వాల్ ధ్వంసం



వృథాగా పోతున్న నీరు

ఫెర్టిలైజర్‌సిటీ: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రామగుండం ఎరువుల కర్మాగారానికి నీటి సరఫరా చేసే మిషన్ భగీరథ పైప్‌లైన్ వాల్‌ను పాలకుర్తి మండలం గుంటూరుపల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుల నీటి నిల్వలు తగ్గడంతో ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారానికి నీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ వాలు ధ్వంసం చేయడంతో ఆదివారం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు.

సంఘం అభివృద్ధికి పాటుపడతాం



సర్టిఫికెట్లు అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

సుల్తానాబాద్: స్వర్ణకార సంఘం అభివృద్ధికి పాటుపడతామని స్వర్ణకార సంఘం పట్టణ అధ్యక్షుడు పొలాస సత్యనారాయణ, కార్యదర్శి కందుకూరి ప్రకాశరావు అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ పట్టణ స్వర్ణకార సంఘం ప్రమాణ స్వీకార మహోత్సవం సంఘ భవనంలో నిర్వహించారు. ఉపాధ్యక్షుడు కందుకూరి ఈశ్వరాచారి, సహాయ కార్యదర్శి వెంకటస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పొలాస ప్రదీప్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల రాజమౌళి, గౌరవాధ్యక్షులు బొజ్జ శంకరయ్య నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం సంఘ భవనంలో నిర్వహించారు. కోశాధికారి కనపర్తి భాస్కరాచారి వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల రాజమౌళి కార్యవర్గ సభ్యులతో జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు రంగు మారు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీరామోజురాజు ధ్రువీకరణ పత్రాలు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు.

కనీస వేతనాలు చెల్లించండి



మాట్లాడుతున్న ఉల్లి మొగిలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఉల్లి మొగిలి డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్జీ-2 ఏరియా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు, డ్రైవర్ల తో నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని పేర్కొన్నారు. జీవో నంబర్ 94ను రద్దు చేసి జీవో నంబర్ 22ను వెంటనే అమలు చేయాలని కోరారు. వేతనాలు సవరించక పోతే సమ్మెకు సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. నాయకులు నరేశ్, రామన్న, రాజ్‌కుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఏజీఎంకు సన్మానం



ఏజీఎంను సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: ఆర్జీ-1 సివిల్ ఏజీఎంగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న నాగేశ్వర్‌రావును ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇల్లెందుక్లబ్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగేశ్వర్‌రావును శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అలాగే ఉద్యోగ విరమణ పొందుతున్న కె.కోటేశ్వర్‌రావును సన్మానించారు. ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ చేతుల మీదుగా జరిగిన ఈ కార్యక్రమంలో సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.రాజలింగు, ప్రధాన కార్యదర్శి ఎ.రాంరెడ్డి, కోశాధికారి రాజమొగిలి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



యైటింక్లయిన్‌కాలనీ: శ్రీశాతవాహన విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 1989 నుంచి 2023 బ్యాచ్ వరకు 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని శాతవాహన పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ప్రిన్సిపాల్ విద్యారత్న అవార్డు గ్రహీత వెంకట మాధవరావు దంపతులను సన్మానించారు.